

ప్రకృతి వనం విధ్వంసం చేసినవారి పై

# చర్యలు తీసుకోవాలి

- బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు - కిష్ట పాటి అంజిరెడ్డి

2


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

శనివారం 15 ఆగస్టు 2026 పేజీలు:12






# అక్కడికి నీళ్లు.. ఇక్కడికి కన్నీళ్లా?

- సాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలి
- తెలంగాణ రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి

2



## కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా వంగూరి పాండు నియామకం

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 14 (ప్రజాజ్యోతి)

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సూచన మేరకు భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వంగూరి పాండును నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ విప్, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వంగూరి పాండు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

వివరాలు 2లో

# దేశంలో అరాచక శక్తుల ఆటలు సాగనివ్వం...!

- హర్ ఘర్ తిరంగా ర్యాలీ లో రావు పద్మ
- 150 అడుగుల భారీ జాతీయ జెండా తో ర్యాలీ

మిర్యాలగూడ, ఆగస్టు 14,(ప్రజాజ్యోతి):

భారతదేశ సమగ్రతకు, విచ్చిన్నానికి పాల్పడే అరాచక శక్తుల ఆటలు సాగనీయమన్నారు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ. వందేమాతర గీతం రచించి 150 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ భారీ ఎత్తున నిర్వహించారు.

వివరాలు 2లో



# దేశంలో అరాచక శక్తుల ఆటలు సాగనివ్వం...!

మొదటిపేజీ తరువాయి



ఫ్లై ఓవర్ నుండి రౌండ్ చౌరస్తా వరకు పట్టణ ప్రజలు విద్యార్థిని విద్యార్థులతో కలిసి 150 అడుగుల భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రావు పద్మ మాట్లాడుతూ దేశ సమగ్రతకుసార్వభౌమాధికారానికి హాని తల పెట్టాలని కానీ, విదేశీ సొమ్ముతో ఈ దేశం లో అరాచకం చేయాలని చూసే విచ్ఛిన్న శక్తులు ఎవరైనా సరే వారికి భారత ప్రభుత్వం,ఈ దేశ యువత సరైన బుద్ధి చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమం లో కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు లక్ష్మీ నరసయ్య, బిజెపి నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాసరావు,గోలి మధుసూదన్ రెడ్డి,హర్ ఘర్ తిరంగా కార్యక్రమ నల్గొండ జిల్లా ఇన్చార్జ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మైల నరసింహామిర్యాలగూడ వన్ టౌన్,టూ టౌన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బంటుగిరి, పెద్దబోయిన వెంకటేశ్వర్లు, కొంగరి వెంకటరమణ,మూల రాజిరెడ్డి,శ్రీకాంత్, సీనియర్ నాయకులు బంటు సైదులు, రేపాల పురుషోత్తం రెడ్డి,ఎడ్ల రమేష్ తుమ్మలపల్లి హనుమంత్ రెడ్డి, కన్మంత్ రెడ్డి అశోక్ రెడ్డి, కొండేటి సరిత, చిలుకూరి రమాదేవి శ్యామ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వెలుగు ఇందిరా నాగరాజ్,చిల్లంచర్ల అభి తదితరులు పాల్గొన్నారు.

# అక్కడికి నీళ్లు.. ఇక్కడికి కన్నీళ్లా?

మొదటిపేజీ తరువాయి

**గరిడేపల్లి,ఆగస్టు 14(ప్రజా జ్యోతి):**

సాగర్ ఎడమ కాలువ పరిధిలోని తెలంగాణ రైతులు నీటి కోసం అల్లాడుతుంటే..రాయలసీమకు నీటి తరలింపుపై ప్రభుత్వం మౌనం వహించడం ఏమిటని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. “అక్కడికి నీళ్లు.. ఇక్కడికి కన్నీళ్లా?” అంటూ ప్రభుత్వ తీరుపై ఆయన మండిపడ్డారు. శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలో విలేకరులతో కడియం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులతో బోర్లు, బావులు ఎండిపోయి సాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతులు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులకు సకాలంలో నీరు అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు.సాగర్ ఎడమ కాలువకు తక్షణమే నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని ఆయన డిమాండ్ చేశారు. కాలువకు విడతల వారీగా నీటిని విడుదల చేస్తే భూగర్భ జలాలు పెరగడం తో పాటు తాగునీరు,పశువుల నీటి సమస్యలు కూడా కొంతవరకు తీరుతాయని పేర్కొన్నారు.రైతులు అప్పులు చేసి పంటలపై పెట్టుబడులు పెట్టారని, నీటి విడుదలలో జాప్యం జరిగితే వారు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యను ప్రభుత్వం అత్యవసరంగా పరిగణించి వెంటనే సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.“సాగర్ ఎడమ కాలువకు నీళ్లు విడుదల చేయకపోతే రైతాంగంతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం” అని కడియం వెంకట్‌రెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ లు కడియం స్వప్న వెంకటరెడ్డి,పెండెం వీరయ్య గౌడ్,మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్సూర్ అలీ,ప పెండెం ధనయ్య గౌడ్, వెంకటరాముడు గౌడ్, అమరగాని వెంకటేశ్వర్లు గౌడ్, ప్రధాని సైదులు ముదిరాజ్, శేషిరెడ్డి,రాజ్ మహమ్మద్, గోపాల్, మామిడి కాశయ్య, అంజయ్య,రెబ్బ శివ,వేణు,పిట్ట నర్సయ్య, చిట్యాల లింగయ్య, పెండెం శ్రీను, పెండెం వినోద్, పెండెం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వనం విధ్వసం చేసినవారి పై చర్యలు తీసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

**పాలకవీడు, ఆగష్టు 14(ప్రజా జ్యోతి ):**

పాలకీడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్నపల్లె ప్రకృతి వనం ధ్వసం చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కె. అంజిరెడ్డి ప్రశ్నించడం జరిగింది. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి పార్క్ ఉండాలనే ఉద్యేశంతో కెసిఆర్ సుమారు నాలుగు లక్షలతో ప్రకృతి వనం నిర్మించడం జరిగింది, కేజీబీవీ ప్రహరీ కోసం చెట్లను ధ్వసం చేయడం దుర్మర్గమైన చర్య బాద్యుల పై కఠిన చర్యలు తీసుకొని చెట్లను తొలగించిన ప్రదేశం లో మొక్కలు నటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిగూడెం సర్పంచ్ నాగయ్య,బిఆర్ఎస్ నాయకులు, సైదులు,హరి నాయక్, గణపతి రెడ్డి, విజయ్,లక్ష్మినారాయణ, దాదే ఖాన్, రాజు రాథోడ్,తదితరులు పాలుగోన్నారు.

# కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా వంగూరి పాండు నియామకం

మొదటిపేజీ తరువాయి

పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.తన నియామకానికి సహకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్య రజినీ శ్రీనివాస్‌గౌడ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, భారత లవకుమార్, కొట్టం కరుణాకర్‌రెడ్డి, తడక రమేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు, పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం ఐజేయూ నిరంతర పోరాటం

## - జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరమంచి రవీందర్ శర్మ



- తుంగతుర్తి నూతన మండల కమిటీ ఎన్నిక పట్ల హర్షం.
- మండల నూతన అధ్యక్షుడిగా పూసపెల్లి యాదగిరి

**తుంగతుర్తి, ఆగస్టు 14,(ప్రజా జ్యోతి):**

జర్నలిస్టుల సమస్యలపై టి యు డబ్ల్యు జే ఐ జేయు నిరంతర పోరాటం చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరమంచి రవీందర్ శర్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని డిఆర్ ఫంక్షన్ హాల్లో నూతన కమిటీని, రాష్ట్ర ఐజ యు ఆదేశాల మేరకు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సీనియర్ జర్నలిస్టు రవీందర్ శర్మ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా పూసపల్లి యాదగిరి, ఉపాధ్యక్షులుగా ఓరుగంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కోదాటి విక్రమ్, కోశాధికారిగా కొండగడుపుల ఎల్లయ్య ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ శర్మ మాట్లాడుతూ... ఐజేయూ సంఘం బలోపేతములో, జర్నలిస్టుల హెల్త్ కార్డు, ఇంటి స్థలాల మంజూరి సమస్యలపై, రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు తాళ్లపల్లి సోమన్న, వడ్లకొండ శ్రీనివాస్, ఎండి నసిరుద్దీన్, ఎండి మాజిద్, అందం సైదులు, భూపతి సైదులు, వర్ధల్లి వీరమల్లు, బింగి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశైలం నీటిని తెలంగాణకు వినియోగించాలి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలి

## - క్రిస్టిపాటి అంజిరెడ్డి

**పాలక వీడు, ఆగష్టు 14(ప్రజా జ్యోతి ):**

పాలకీడు మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి,నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి ఆదేశానుసారం, శుక్రవారం రోజున మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుడు గుంట్ల పాలెం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు క్రిష్టిపాటి అంజిరెడ్డి మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్నప్పటికీ పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించుకుపోతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటి తరలింపుపై ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రైతులకు సాగునీరు అందకుండా చేసి ఆంధ్రా రైతులకు నీటిని తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.కేఆర్ఎంబీ అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ నీటిని వినియోగిస్తోందని ఆరోపించారు , ఇదే అంశాన్ని బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.ప్రస్తుతం రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను సక్రమంగా వినియోగించకపోతే భవిష్యత్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని అన్నారు. రైతుల పంటలు ఎండిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నీటి వినియోగంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాలపై రాజీ పడవద్దని సూచించారు. రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు.తెలంగాణ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు...ఈ కార్యక్రమం లో ప్యాక్స్ చైర్మన్ యాద్రెడ్ల సత్యనారాయణ రెడ్డి, పసుపులేటి సైదులు.సర్పంచ్ లు గణపతి రెడ్డి మంద నాగయ్య, ఉప సర్పంచ్ సక్రు నాయక్, హరి నాయక్ పాల్గొన్నారు.

# మొబైల్ షాప్‌లో చోరీ

## - రూ.80 వేల విలువైన మొబైల్ ఫోన్లు అపహరణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**నడిగూడెం, ఆగస్టు 14, ప్రజా జ్యోతి:**

మండల కేంద్రంలో మొబైల్ షాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన దున్న అశోక్ నిర్వహిస్తున్న మొబైల్ షాప్‌లో సుమారు రూ.80 వేల విలువైన మొబైల్ ఫోన్లు చోరీ అయినట్లు బాధితుడు అశోక్ తెలిపారు.సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై తేజస్విని సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్‌కు సమాచారం అందించగా, సభ్యులు సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.








# కామ్రేడ్ బూరుగు అంజయ్య జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం

**కట్టంగూర్ ఆగస్టు 14 ప్రజా జ్యోతి**

కట్టంగూర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ నాయకుడు కామ్రేడ్ బూరుగు అంజయ్య 24వ వర్ధంతి సభ ఈదులూరు గ్రామంలోని బూరుగు అంజయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కా. గజ్జి రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ కార్యకర్త చింతల అంజయ్య ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం అంజయ్య విగ్రహానికి జిల్లా కార్యదర్శి సాగర్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సభలో జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ.. కామ్రేడ్ బూరుగు అంజయ్య ప్రజా జీవితం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. నిజాం నవాబు అరాచక పాలనతో పాటు గ్రామాల్లో పటేల్, పట్వారీలు, దొరల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అంజయ్య ధైర్యంగా పోరాటం చేశారని తెలిపారు. బానిసత్వాన్ని ఎదిరించి ప్రజలను చైతన్యపరిచి పోరాటాల వైపు నడిపించారని పేర్కొన్నారు.ఈదులూరు గ్రామానికి సుమారు 45 సంవత్సరాలు ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో భూమి సమస్యలపై రైతులు, వ్యవసాయ కూలీలను ఐక్యం చేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని అన్నారు. “దున్నేవానికే భూమి” అనే నినాదంతో ఎర్రజెండా నాయకత్వంలో జరిగిన పోరాటాల్లో అంజయ్య కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.అంజయ్య ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని, ఆయన స్మారకార్థం నిర్మించిన విజ్ఞాన కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సాగర్ అన్నారు. అంజయ్య ఆశయాలు, ప్రజా ఉద్యమాల చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి, ఉపాధ్యక్షుడు గజ్జి రవి మాట్లాడుతూ.. అంజయ్య అందించిన రాజకీయ చైతన్యంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. యువత, విద్యార్థులు ప్రజా సమస్యలపై చైతన్యంతో ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని కామ్రేడ్ బూరుగు అంజయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

---





# క్రీడా పోటీలను ప్రారంభించిన - ఎస్సై తేజస్విని

## - కరివిరాల మోడల్ స్కూల్‌లో విద్యార్థుల సందడి.. - ఉత్సాహంగా క్రీడా పోటీలు

**నడిగూడెం, ఆగస్టు 14, ప్రజా జ్యోతి:**

కరివిరాల స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కరివిరాల తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాలలో క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నడిగూడెం మండల ఎస్సై తేజస్విని ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.ప్రిన్సిపాల్ ఎం. సాయిశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, టెన్నిస్‌తో పాటు జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, పరుగు పందేలు, హైజంప్, లాంగ్‌జంప్ తదితర పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై తేజస్విని మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమయస్ఫూర్తి, ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పాఠశాల తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని ప్రిన్సిపాల్ ఎం. సాయిశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భార్యాభర్తల జంట హత్య కేసు

# 24 గంటల్లో ఛేదన

- సీసీ కెమెరాలు,సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు ఇద్దరి అరెస్ట్ - నిందితుల్లో మోతే పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్
హత్యకు ఉపయోగించిన గుదిబండ,బైక్,సెల్‌ఫోన్లు స్వాధీనం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 14(ప్రజాజ్యోతి):**

మోతే పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన భార్యాభర్తల జంట హత్య కేసును సూర్యాపేట జిల్లా పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు.సీసీ కెమెరా ఫుటేజీ,సాంకేతిక ఆధారాలు,స్థానికుల సమాచారాన్ని సమన్వయం చేసుకుని నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు.శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసు దర్యాప్తు,నిందితుల అరెస్ట్,స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలను వెల్లడించారు.

### జాతీయ రహదారి సమీపంలో మృతదేహాల గుర్తింపు

మోతే మండల కేంద్రం శివారులో జాతీయ రహదారి 365బీబీ ఫ్లైఓవర్‌కు సుమారు 200 మీటర్ల దూరంలోని వ్యవసాయ భూమిలో కాళ్లు కనిపించే విధంగా మృతదేహాలను పాక్షికంగా పాతిపెట్టినట్లు గురువారం ఉదయం స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది.సమాచారం అందుకున్న వెంటనే కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి,మునగాల సీఐ రామకృష్ణారెడ్డి,స్థానిక ఎస్ఐ లచ్చిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు.గ్రామ అధికారుల సమక్షంలో మృతదేహాలను వెలికితీసి పరిశీలించగా మోతే మండలం బిక్యాతండాకు చెందిన హలావత్ నాగులు,ఆయన భార్య హలావత్ బూబాగా గుర్తించారు.ఎస్పీ నరసింహ కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు అధికారులకు పలు సూచనలు చేశారు.

### సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల గుర్తింపు

కేసును ఛేదించేందుకు కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి,సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్,మునగాల సీఐ రామకృష్ణారెడ్డి,సీసీఎస్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.దర్యాప్తులో భాగంగా పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా రెండో నిందితుడు జిల్లేపల్లి సుందర్ అనుమానాస్పదంగా కదులుతున్న దృశ్యాలు పోలీసులకు లభించాయి.సీసీ కెమెరా ఫుటేజీతో పాటు సాంకేతిక ఆధారాలు,స్థానికుల సమాచారాన్ని విశ్లేషించిన పోలీసులు నిందితులను గుర్తించారు.శుక్రవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద ప్రధాన నిందితుడు ఎం.డి. షరీఫ్, మరో నిందితుడు జిల్లేపల్లి సుందర్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.

### డబ్బుల వ్యవహారమే హత్యలకు కారణం

పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం మోతే గ్రామానికి చెందిన సుందర్‌కు మోతే పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.డి.షరీఫ్‌తో పరిచయం ఉంది.సుందర్ ద్వారా నాగులు,బూబా దంపతులకు షరీఫ్‌తో పరిచయం ఏర్పడి సాన్నిహిత్యం పెరిగింది.కుటుంబ అవసరాల నిమిత్తం బూబా,నాగులు దంపతులు కోరడంతో షరీఫ్ సుమారు రూ.3 లక్షలు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించే విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడినట్లు పేర్కొన్నారు.డబ్బులు తిరిగి ఇవ్వాలని షరీఫ్ ఒత్తిడి చేయగా,తనపై అట్రాసిటీ కేసులు పెడతామని దంపతులు బెదిరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.దీంతో వారిని హత్య చేయాలని షరీఫ్ నిర్ణయించుకుని సుందర్ సహకారం కోరినట్లు పోలీసులు తెలిపారు.



### పథకం ప్రకారం హత్య

పోలీసుల వివరాల ప్రకారం గొర్రెల రుణం ఇప్పిస్తామని నమ్మించి,రుణం కోసం గొర్రెలు ఉన్నట్లు చూపించాల్సి ఉంటుందని నాగులు,బూబాలను నిందితులు నమ్మించారు.గొర్రెల కోసం నీటి వసతి,ఎరువు కోసం గుంత అవసరమని చెప్పి మోతే గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్దకు వారిని తీసుకెళ్లేందుకు పథకం రూపొందించారు.ఈ క్రమంలో ఆగస్టు 11 రాత్రి ముందుగా నాగులను మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్లి జాతీయ రహదారి 365బీబీ ఫ్లైఓవర్ సమీపంలోని వ్యవసాయ భూమి వద్దకు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.గుంత తవ్వించే క్రమంలో వెనుక నుంచి గుదిబండతో తలపై దాడి చేయడంతో నాగులు అక్కడికక్కడే మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడైంది.అనంతరం మృతదేహాన్ని గుంతలో పాతిపెట్టినట్లు పోలీసులు తెలిపారు.కొంత సమయం తరువాత బూబాను కూడా అదే ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసి,ఆమె మృతదేహాన్ని గుంతలో పాతిపెట్టినట్లు పోలీసులు వెల్లడించారు.ఆమె వద్ద ఉన్న ఆభరణాలను కూడా నిందితులు తీసుకెళ్లినట్లు తెలిపారు.

### నిందితుల నుంచి కీలక వస్తువుల స్వాధీనం

నిందితులను విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన గుదిబండ,ఏ-1 షరీఫ్‌కు చెందిన మోటార్‌సైకిల్,రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

### పోలీసు బృందాలకు అభినందనలు

కేసును వేగంగా ఛేదించడంలో కీలకంగా పనిచేసిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి,సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్,మునగాల సీఐ రామకృష్ణారెడ్డి,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్,స్థానిక ఎస్ఐ లచ్చిరెడ్డి,సీసీఎస్ ఎస్ఐలు సాయిరాం,హరికృష్ణతో పాటు సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ నరసింహ అభినందించారు.ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేసినట్లు తెలిపారు.

---

# ప్రభుత్వ బడులకు యూనిఫామ్లు పంపిణీ కార్యక్రమం



**చింతపల్లి ఆగస్టు 14(ప్రజాజ్యోతి)**

ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు ఆగస్టు 15 నాటికి యూనిఫాములు అందేలా చూడాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే.అదే తరహాల్లో చింతపల్లి మండలానికి సంబంధించిన 13 ప్రాథమికి పాఠశాలకు పంద్రాగస్టు సందర్భంగా కుట్టు పూర్తయిన యూనిఫాములను ఎంఈఓ అంజయ్య పంపిణీ చేశారు.మిగిలిన పాఠశాలలకు సంబంధించిన యూనిఫామ్స్ వస్త్రాన్ని కుట్టుమిషన్ల దగ్గర వర్కు నడుస్తుందన్నారు.మిగిలిన దుస్తువులకు కుట్టు పూర్తికాగానే పాఠశాలలకు త్వరలో పూర్తిస్థాయిలో అందిస్తామని తెలిపారు.

# గద్దర్ గాథకు దృశ్యరూపం.. 'ప్రజా యుద్ధనౌక' పోస్టర్ ఆవిష్కరణ

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 14 (ప్రజాజ్యోతి):**




తెలంగాణ విప్లవ గాయకుడు, ప్రజాకవి గద్దర్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిస్తున్న "ప్రజా యుద్ధనౌక గద్దర్" డాక్యుమెంటరీ చిత్ర పోస్టర్‌ను శుక్రవారం గద్దర్ నివాసంలో ఆవిష్కరించారు. గద్దర్ సతీమణి విమలమ్మ, ఆయన కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. భూదాన్ పోచంపల్లి పట్టణానికి చెందిన సోమ జ్యోతిర్గమయ చిత్ర దర్శకుడు, గద్దర్ అవార్డు విన్నర్ బడుగు విజయ్ దర్శకత్వంలో, విమల్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత తడక రమేష్ నిర్మాణ సారథ్యంలో ఈ డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు మాట్లాడుతూ ప్రజా జీవితమే తన ఊపిరిగా బతికిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అడవి నుంచి ప్రజల మధ్యకు వచ్చి ఉద్యమాన్ని ముందుకు నడిపిన గద్దర్ జీవిత విశేషాలను, ఆయన పోరాట స్ఫూర్తిని ప్రజలందరికీ అందించే ఉద్దేశంతో ఈ డాక్యుమెంటరీని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి సహ నిర్మాతగా గుంటి నాగేష్, సంగీత దర్శకుడిగా మార్కు ప్రశాంత్, ఎడిటర్‌గా విజువల్స్ రాజు చెన్నూరు పనిచేస్తున్నారని తెలిపారు. చిత్ర నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు.

# నీట్ లాంగ్‌టర్మ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- 22లోపు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.

**నడిగూడెం,ఆగస్టు 14, ప్రజా జ్యోతి:**

202627 విద్యా సంవత్సరానికి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నీట్ లాంగ్‌టర్మ్ శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారి (డీసీఓ) సిహెచ్. పద్మ తెలిపారు. హైదరాబాద్‌లోని టీజీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ఫౌండేషన్ సీవోఈ, చిలుకూరులో బాలురకు 100 సీట్లు, మహేంద్రహిల్స్ ఫౌండేషన్ సీవోఈలో బాలికలకు 100 సీట్లు కేటాయించి నీట్ శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. 202526 విద్యా సంవత్సరంలో బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోపు సొసైటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తును పూర్తి చేసిన అనంతరం అవసరమైన అన్ని ధ్రువపత్రాలను జతచేసి, నిర్దేశించిన సమయంలో డీసీఓలకు అందజేయాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీఓ సిహెచ్. పద్మ కోరారు.



# డెడ్ స్టోరేజ్ లో కూడా సాగునీరు ఇచ్చిన ఘనత తమది...

## ప్రాజెక్టులో నీళ్లు ఉన్నా ఆయకట్టును ఎండబెడుతున్న చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది...!

**- ఆంధ్ర పాలకులు సాగునీటిని తరలించుకుపోతున్నా సోయిలేని ప్రభుత్వం**

**- ఒక్క పంట కైనా సాగునీరు ఇచ్చి ఆయకట్టును రక్షించాలి - మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు**



**మిర్యాలగూడ, ఆగస్టు 14,( ప్రజాజ్యోతి ):**

నాగార్జునసాగర్ లో డెడ్ స్టోరేజ్ నీళ్లు ఉన్నప్పుడే సాగునీటిని అందించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వాన్నిదని కానీ ప్రాజెక్టులకు నిండా నీరు చేరుతున్న మొదటి పంటకు సాగునీరు ఇవ్వకపోవడం ప్రభుత్వ బాధ్యత రాహిత్యానికి నిదర్శనం. అని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చిత్తశుద్ధి లేని యాగాలతో వర్షాలు కురవక పోగా,పడే వర్షం కూడా వెనక్కి పోయిందని ఎద్దేవా చేశారు. ఎల్ ని నో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద చేరుకుందని అక్కడి నుండి నాగార్జునసాగర్ లో 522 అడుగులకు నీరు వచ్చినప్పటికీ ఆయకట్టుకు నీరు వదలకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు18,000 క్యూసెక్కుల నీటి ని నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్ర పాలకులు తరలించకపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా వేడుక చూస్తుంద న్నారు. సాగర్ ప్రాంత వాసిగా సీనియర్ కాంగ్రెస్ నేత కుందూరు జానారెడ్డికి సాగర్ ప్రాజెక్టు పై పూర్తి అవగాహన ఉందని, దేశానికి అన్నం పెట్టే సాగర్ ఆయకట్టును ఎండబెట్టకుండా రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలని కోరారు. ఉమ్మడి జిల్లాకే చెందిన ఉత్తంకుమార్ రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ప్రాజెక్టుల సామర్థ్యం సాగునీరు అందించే విషయాలపై అవగాహన లేకపోవడం వలన రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుంద న్నారు. మంత్రులతోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా రైతులను ఆదుకోవాలని సోయలేకపోవటం సిగ్గుచేటు అన్నారు. ఆయకట్టులో రైతులు విపరీతంగా వరి ధాన్యం సాగు చేస్తున్నారని అక్కసు తో, అధికారులు నీటి విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం వారి మాటలను పట్టించుకోకుండా సాగునీరు విడుదల చేయడం లేదని ఆరోపించారు. ప్రాజెక్టులను నిర్వహించడం చేతకాకపోతే తమకు అప్పగించాలని లేదా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరి సలహాలు సూచనలు స్వీకరించాలని కోరారు. చేతులెత్తి మొక్కుతున్న ఒక్క పంటకైనా సాగునీరు అందించి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇదే విధంగా మొండిగా వ్యవహరిస్తే రైతులు తిరగబడతారని, ఆయకట్టు రైతంగాన్ని ఆదుకునేందుకు తమ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలుయూరియా యాప్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి,చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాగార్జున చారి, కే వీరకోట్ రెడ్డి, ఎండి యూసుఫ్, కరుణాకర్ రెడ్డి, హాతిరాం నాయక్, చౌగాని బిక్షం గౌడ్, వినోద్ నాయక్, ఎండి షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా, బాలల హక్కులపై అవగాహన

**నడిగూడెం, ఆగస్టు 14, ప్రజా జ్యోతి:**

కరివిరాలస్థానిక ఎంపీపీఎస్ పాఠశాలలో సర్పంచ్ మారోజు పార్వతమ్మ అధ్యక్షతన ప్రత్యేక మహిళా సభ, బాల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి, సాధికారతతో పాటు మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాణబోతు కృష్ణారెడ్డి, కార్యదర్శి అన్వర్ పాషా, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, పాఠశాల సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



# విద్యార్థులకు యూనిఫామ్ అందజేసిన సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

**భువనగిరి,రూరల్ ఆగస్ట్ 14(ప్రజాజ్యోతి)**

భువనగిరి మండలం,బిఎన్ తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానో పాధ్యాయులు రచ్చ మల్లికార్జున్,సమక్షంలో తెలంగాణ,ప్రభుత్వం పంపిణీ చేసిన స్కూల్ యూనిఫారం లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అనేక రకాలైన సదుపాయాలు కల్పిస్తుందని, ఉచిత పాఠ్య పుస్తకాలు,నోట్ పుస్తకాలు,అందిస్తూ మధ్యాన్నం భోజనం తో పాటు రాగిజావ,ఉదయం అల్పాహారం,లాంటి సదుపా యాలు కల్పిస్తుందని మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను,అందిస్తుందని,దీనిని ప్రతి ఒక్క తల్లిదండ్రులు వినియోగించుకుని మీ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేల కృషిచేయాలని కోరారు. అనంతరంపంద్రాగస్టు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించే ఆటల పోటీలను ప్రారంభించారు. జరిగే ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ సింగిల్విండో డైరెక్టర్,ఎస్ ఎం సి చైర్మన్ ఉపాధ్యా యులు వార్డు సభ్యులు మాజీ,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# చీదేళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్ విరాళం

**పెన్‌పహాడ్, ఆగస్టు 14(ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని చీదేళ్ల జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు ప్రముఖ సామాజిక సేవకుడు లచ్చిమల్ల వెంకన్న తన తండ్రి లచ్చిమల్ల సైదులు స్మారకార్థం రూ. 12 వేల విలువైన అహూజా మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ,వెంకన్న చిన్ననాటి నుంచే విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా సామాజిక సేవలో చురుగ్గా పాల్గొంటూ, ఇప్పుడు పాఠశాల అవసరాలను గుర్తించి మైక్‌సెట్‌ను అందించడం ఆదర్శనీయమన్నారు.





జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - చీదేళ్ల



# ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి దేవరకొండ

## - ఎమ్మెల్యే బాలు నాయక్‌కు వినతిపత్రం అందజేత

**దేవరకొండ, ఆగస్టు 14, (ప్రజా జ్యోతి):**

ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ను ఉపాధ్యాయులు, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు ఈరోజు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంతో బాధ్యతాయుతంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నప్పటికీ, తమకు అందుతున్న తక్కువ వేతనాల వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 339 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు అత్యల్ప వేతనాలతో సేవలు అందిస్తున్నారని, తమ వేతనాలను పెంచి గౌరవప్రదమైన జీవనం సాగించే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టబోయే ధర్నా కార్యక్రమం గురించి ఎమ్మెల్యే గారికి వివరించారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి, సంబంధిత శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో చర్చించి తమకు న్యాయం జరిగేలా సహకరించాలని ఎమ్మెల్యే బాలు నాయక్ ను కోరారు. ఉపాధ్యాయులు మరియు ప్రతినిధుల ప్రకటన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల జీవితాల్లో కూడా భరోసా ఉండాలి. మా డిమాండ్లు ఎంతో న్యాయమైనవి. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మా సమస్యలను పరిష్కరించే వరకు మా పోరాటాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తాం. ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు మరియు ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# త్వరగా కడితే... వెనువెంటనే బిల్లులు

## - జంగాల కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల క్షేత్రస్థాయి పరిశీలన

## - హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

**హాలియా,ఆగస్టు14(ప్రజా జ్యోతి)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వీలైనంత త్వరగా వేగవంతం చేయాలని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. రోజువారీ పర్యవేక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు జంగాల కాలనీలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడిన చైర్మన్ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ ఏ దశలో ఉందో ఆరా తీసి పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు ఎంత వేగంగా సాగితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంబంధించిన బిల్లులు కూడా అంతే వేగంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని స్పష్టం చేశారు. పనుల్లో అనవసర జాప్యం చేయకుండా త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం,సంబంధిత అధికారులు నిర్దేశించిన కొలతలు,ప్లాన్ ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. సొంత నిర్ణయాలతో పరిమితికి మించి అదనపు అంచనాలతో ఎక్కువ పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా ఇబ్బందుల పాలు కావద్దని హితవు పలికారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పక్కాగా నిర్మాణాలు పూర్తి చేసుకొని,ప్రభుత్వం అందిస్తున్న బృహత్తర ఆర్థిక సహాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజాజ్యోతి
శనివారం 15 ఆగస్టు 2026

# ఈసారి వరి వద్దు.. ఆరుతడి పంటే ముద్దు

## - ఆయకట్టు రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ విజ్ఞప్తి





**హాలియా,ఆగస్టు14(ప్రజా జ్యోతి)**

ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు వరి సాగుకు స్వస్తి చెప్పి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. అనుముల మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నామని, వ్యవసాయ అవసరాలకు నీటి విడుదల సాధ్యపడదని ఆయన స్పష్టం చేశారు.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైతులు ఈ నెలాఖరు వరకు కందులు, పెసర్లు,మినుములు,ఉలవలు, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి మంచి దిగుబడులు పొందాలని సూచించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని,అధిక నీటి వినియోగం అయ్యే వరి సాగును నివారించాలని కోరారు.కార్యక్రమంలో హాలియా ఏడీఏ ఎం.సరిత,అనుముల, నల్లగొండ మండలాల వ్యవసాయ అధికారులు, శ్రీనాథపురం,ఇబ్రహీంపేట వ్యవసాయ విస్తరణ అధికారులు,ఇబ్రహీంపేట హజారీగూడెం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మానవత్వమే నైజం.. సేవే ఆయన మార్గం

## - ఖాజా మైనోద్దీన్‌కు అమీర్ అలీ ఫౌండేషన్ అవార్డు





**హాలియా,ఆగస్టు14(ప్రజా జ్యోతి)**

తోటి మనిషి కష్టాల్లో ఉంటే చేయూతనందించడమే పరమావధిగా భావిస్తూ,మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.హాలియా పట్టణానికి చెందిన ఖాజా మైనోద్దీన్.గత 15 సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటూ నేటి యువతకు స్ఫూర్తిప్రదాతగా నిలుస్తున్న ఆయన సేవలను గుర్తించి అమీర్ అలీ ఫౌండేషన్' ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేసింది.బాల్యం నుంచే తల్లిదండ్రులు నేర్పిన నైతిక విలువలను పాటిస్తూ,సొంత కష్టార్జితం నుంచే నిరాశ్రయులైన వృద్ధులకు అన్నదానం చేయడం,శీతాకాలంలో దుప్పట్లు పంపిణీ చేయడం అనారోగ్యంతో బాధపడే నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించడం ఆయన నైజం.ఎలాంటి స్వార్థం లేకుండా ఆయన అందిస్తున్న నిరంతర సేవలకు గాను ఈ పురస్కారం వరించింది.ఈ సందర్భంగా ఖాజా మైనోద్దీన్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఒకరి కష్టంలో తోడుగా ఉండాలని మా అమ్మనాన్నలు నేర్పారు.ఆకలి బాధ ఏంటో నాకు తెలుసు, అందుకే నా సంపాదనలో కొంత భాగాన్ని నిరుపేదల ఆకలి తీర్చడానికి ఉపయోగిస్తున్నాను.అమీర్ అలీ పరిచయం తర్వాత సేవా కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొంటున్నాను.నా పరిధి ఉన్నంత వరకు పేదలకు సహాయం చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.

# పోక్సో చట్టం, బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన

**వలిగొండ, ఆగస్టు 14(ప్రజాజ్యోతి న్యూస్):**

గోకారం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డిసి పియు) ఆధ్వర్యంలో పోక్సో చట్టం, బాలల హక్కులు, బాలల రక్షణ, బాల్యవివాహాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఎం. మత్స్యగిరి మాట్లాడుతూ.. పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు జరిగినప్పుడు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. పిల్లలు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా బాల కార్మిక వ్యవస్థ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, గుడ్ టచ్‌బ్యాడ్ టచ్, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవల గురించి వివరిస్తూ.. పిల్లలకు సంబంధించిన సమస్యలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు 1098కు సమాచారం అందించాలని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, స్కోప్ సంస్థ (ఎన్‌జీఓ) ప్రతినిధి బి. నరసింహరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఏం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షునిగా:లింగాల ముత్తయ్య నియామకం...

**నార్కట్ పల్లి,ఆగస్టు 14,( ప్రజా జ్యోతి ):**

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లిలో ఏంఆర్ పి ఎస్ మండల సమావేశాన్ని శుక్రవారం రోజున నిర్వహించారు.అనంతరం మండల అధ్యక్షులుగా పట్టణ కేంద్రానికి చెందిన లింగాల ముత్తయ్యను నియమించారు.నూతనంగా ఎన్నికైన లింగాల ముత్తయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఇంత పెద్దటి పదవీ బాధ్యతలు అప్పగించినందుకు కులం అభివృద్ధి,ఇంకా అనేక సమస్యలపై పోరాటం చేస్తానని నా ఎన్నికకు సహకరించిన నాయకులు చిరుమర్తి యాదయ్య,మేడి శంకర్, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్, మాజీ మండల అధ్యక్షులు అదిమల్ల నరసింహ, కొమ్ము శ్రీను, లింగాల వేణుగోపాల్, మంద మారయ్య, టౌన్ అధ్యక్షులు మంద సుధాకర్,వడ్డేపల్లి నాగరాజు గత 30 సంవత్సరాలు నుండి ఉద్యమంలో పనిచేస్తున్న మాదిగ దండోరా ఉద్యమకారులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## మృతుని కుటుంబానికి బిఆర్ఎస్ నేత ఆర్థిక సాయం

**పెన్‌పహాడ్, ఆగస్టు 14(ప్రజా జ్యోతి):**

మండల కేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన పెన్ పహాడ్ బిఆర్ఎస్ గ్రామ శాఖ కార్యదర్శి షేక్ రహిమాన్ కుటుంబ సభ్యులను శుక్రవారం పార్టీ నాయకులు పరామర్శించారు.గ్రామ శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ₹45,500 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..పార్టీకోసం రహిమాన్ చేసిన సేవలు మరవలేనివని,ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇంద్రసేనారావు,మాజీ సర్పంచ్ ఊరుకొండ రాధాకృష్ణ,దాసరి శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు వగ్గు గోపి, డైరెక్టర్ గూడపూర్ రవి,పిడమర్తి నాగయ్య, గూడిపూరి శ్రీనివాస్, మైనార్టీ సెల్ సయ్యద్ సుభాని,గోపన్న తదితరులు పాల్గొన్నారు.



# పల్లె దవాఖానకు ప్రహరీ.. నీటి వసతి కల్పించాలి

## - ఐద్వా అధ్యక్షురాలు తంగెళ్ల వెంకటచంద్ర


**గరిడేపల్లి,ఆగస్టు 14 (ప్రజాజ్యోతి):**

పల్లె దవాఖానకు తక్షణమే ప్రహరీ గోడ నిర్మించి, శాశ్వతంగా నీటి సౌకర్యం కల్పించాలని ఐద్వా అధ్యక్షురాలు తంగెళ్ల వెంకటచంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో పల్లె దవాఖానను సందర్శించి సమస్యలను పరిశీలించారు.కీతవారిగూడెం,రాయిని గూడెం, కాల్వపల్లి గ్రామాల ప్రజలకు సేవలందిస్తున్న ఆస్పత్రిలో వైద్యుడు, మందులు అందుబా టులో ఉన్నప్పటికీ నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు.మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమీపంలో స్మశానవాటిక ఉండటంతో బోరు నీటి సౌకర్యం కూడా లేదన్నారు. అదేవిధంగా ప్రహరీ లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణలో ఇబ్బందులు, న్యూసెన్స్ ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రహరీతో పాటు శాశ్వత నీటి వసతి కల్పిస్తే మూడు గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు.ఆస్పత్రిలో వైద్యురాలు సుష్మ,సిబ్బంది అందిస్తున్న సేవలు బాగున్నాయని రోగులు తెలిపినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు యానాల సుశీల, సుందరి, రమాదేవి పాల్గొన్నారు.



# జనావాసాల నడుమ డంపింగ్ యార్డు వద్దు

- సర్వే నం. 326లో పనులు తక్షణమే ఆపాలి
- మున్సిపల్ కార్యాలయం ఎదుట గ్రామస్థుల నిరసన
- వెనక్కి తగ్గకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం
- సర్పంచ్ సూర్వి మల్లేష్ గౌడ్



**చౌటుప్పల్, ఆగస్టు 14 (ప్రజా జ్యోతి ):**

జనావాసాలు, విద్యాసంస్థల మధ్య డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సూర్వి మల్లేష్‌గౌడ్ స్పష్టం చేశారు. లింగోజీగూడెం సర్వే నంబర్ 326లో చేపడుతున్న పనులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్థులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మొగుదాల పావని రమేష్ గౌడ్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సూర్వి మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ.. వందలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగించే విద్యాసంస్థలు, వేలాది మంది ప్రజలు నివసించే ప్రాంతాల మధ్య డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. చెత్తతో దుర్వాసన, కాలుష్యం ఏర్పడి ప్రజలు, విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. జనావాసాలకు దూరంగా ఉన్న ఇతర ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు వెంటనే పనులు నిలిపివేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్వి సత్తయ్యగౌడ్, బత్తుల అనూష, దొడ్ల అండాలు, రాపోలు రేణుక, యాట శంకరయ్య, పర్ని శ్రీనివాస్‌రెడ్డి, దొడ్ల సెట్టయ్యగౌడ్, పర్నే శ్రీధర్‌రెడ్డి, భీమగోని మల్లేశంగౌడ్, కాకులారం సంజీవరెడ్డి, ఎర్రగోని శ్రీనివాస్, మోడపు పెంటయ్య, మోడెపు జంగయ్య, రాపోలు మల్లేష్, పెండెం లక్ష్మి, ముద్దం భారతి, ముద్ద మంజుల, బొడిగె అమృత, గంగిరెడ్డి మంజుల, కళావతి తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాలలో అభివృద్ధి సమన్వయం అవసరం

## - సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి జరుగుతుంది
## - శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి




మునుగోడు, ఆగస్టు, 14, (ప్రజా జ్యోతి )

మునుగోడు మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి సమావేశంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి జరగాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అది సాధ్యమవుతుందని, గ్రామంలోని గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడీ భవనం, పాఠశాల భవనం, ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్ర భవనాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగానే నిర్మాణం చేపట్టాలని నూతన సర్పంచులు ఎన్నికైన తర్వాత మొట్టమొదటిసారి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అభివృద్ధి సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కలిసి పాల్గొన్నారు వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి రిపోర్టు ను అధికారులు గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన జరగాలంటే ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు..విద్యుత్తు, ఇందిరమ్మ గృహాలు పెన్షన్లు, వ్యవసాయం, రోడ్లు, రెవెన్యూ, తదితరు అంశాలపై చర్చించారు 90 శాతం అనారోగ్యానికి కారణం మనం త్రాగే నీరని గ్రామాలలో త్రాగునీరు కోసం, బోరు నీరు కోసం విడివిడిగా వాటర్ ట్యాంకులు మైంటైన్ చేస్తున్నారా లేదా అని అధికారులు అడిగి తెలుసుకున్నారు... కచ్చితంగా వేరువేరు ట్యాంకులను మైంటైన్ చేయాల్సిందేనని అధికారులను ఆదేశించారు రెండున్నర సంవత్సరాలు ప్రయత్నిస్తే అభివృద్ధి పనులు సర్పంచులు అభివృద్ధి పనులకు సహకరించాలి నియోజకవర్గ వ్యాప్తంగా 400 రోడ్లు వస్తున్నాయని, ఇప్పటికే చాలా రోడ్ల అభివృద్ధి జరుగుతుందని,, అభివృద్ధికి పార్టీలకతీతంగా సర్పంచులు సహకరించాలన్నారు.గ్రామాలలో చిన్నతనంలోనే వితంతువులు అవుతున్న వాళ్ల సంఖ్య పెరుగుతుందని దీనికి ప్రధాన కారణం తాగుడే అన్నారు.బెల్ట్ షాపుల నిర్మూలన తో మునుగోడులో కొంత తగ్గిందని, అక్కడక్కడ చాటుమాటుగా అమ్ముతున్న వాళ్లను కూడా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు..జనాభా ఎక్కువగా ఉన్న గ్రామపంచాయతీలు జనాభా మధ్యస్థంగా ఉన్న గ్రామపంచాయతీలు జనాభా తక్కువగా ఉన్న గ్రామపంచాయతీలకు భవనాల నిర్మాణాలలో వ్యత్యాసం ఉంటుందని జనాబాకు తగ్గట్టుగా నిధుల కేటాయింపు జరపాల్సి ముందుగా గ్రామపంచాయతీ సెక్రటరీలు బాగా పనిచేయాలని, సెక్రటరీలు సమయపాలన కచ్చితంగా పాటించాల్సిందేనని, నియోజకవర్గంలో అధికారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, డిపిఓ తరుణ్ చక్రవర్తి, ఎమ్మార్వో నరేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల మండలాధికారులు, గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు....

---

# సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

## - ముఖ్యఅతిథిగా హాజరైన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
## - అధ్యక్షుడిగా రెండోసారి బొబ్బిళ్ల మురళి బాధ్యతల స్వీకరణ- ఆలయ సర్వతో ముఖాభివృద్ధికి సహకరిస్తాం : ఎమ్మెల్యే కోమటిరెడ్డి



చౌటుప్పల్, ఆగస్టు 14 ( ప్రజా జ్యోతి ):




చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు.అనంతరం దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా (చైర్మన్‌గా) బొబ్బిళ్ల మురళి వరుసగా రెండోసారి ప్రమాణస్వీకారం చేశారు. ధర్మకర్తలుగా వర్కల రవిగౌడ్, ఆవుల యేసుయాదవ్, దాడి యశ్వంత్‌రెడ్డి, గంగులోతు అరుణ ప్రమాణం చేసి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పురాతన ప్రసిద్ధి గాంచిన సీతారామచంద్రస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నూతన పాలకమండలి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, నీడ, క్యూలైన్లు వంటి మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులకు తన వంతుగా పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.రెండోసారి అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు బొబ్బిళ్ల మురళి కృతజ్ఞతలు తెలుపుతూ.. పాలకవర్గ సభ్యుల సహకారంతో స్వామివారి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన పాలకమండలి సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పురపాలక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, పట్టణ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు, బాలికల భద్రతకు భరోసా కేంద్రం కీలకం..

## - భరోసా కేంద్రాన్ని సందర్శించిన.. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్





**నల్గొండ ఆగస్టు 14,(ప్రజా జ్యోతి ):**

మహిళలు, బాలికలు, చిన్నారులు లైంగిక హింసకు గురైన సందర్భాల్లో వారికి అండగా నిలుస్తూ పోలీస్, వైద్య, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ వంటి సమగ్ర సేవలను ఒకే వేదిక ద్వారా అందించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని భరోసా కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం ద్వారా బాధితులకు అందిస్తున్న వివిధ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు సత్వర సహాయం అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితులు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తెలియజేసే విధంగా సానుకూలమైన, నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 14(ప్రజాజ్యోతి):**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,జిల్లా ఎస్పీ కె.నరసింహ అధికారులను ఆదేశించారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను వారు సంయుక్తంగా పరిశీలించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో నిర్వహించనున్న పోలీస్ కవాతు రిహార్సల్స్‌ను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. పరేడ్ గ్రౌండ్‌లో వేదిక, సీటింగ్, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.వేడుకలకు హాజరయ్యే ప్రజలు, విద్యార్థులు, అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు, పౌరులు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, ఆర్డీఓ వేణుమాధవ్, డీఈఓ అశోక్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# పారదర్శకంగా పోలీసు సంక్షేమ సంఘం ఎన్నికలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 14(ప్రజాజ్యోతి):**

సూర్యాపేట జిల్లా పోలీసు సంక్షేమ సంఘం ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు.రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు పోలీసు సంక్షేమంలో భాగంగా ఈ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి ఎన్నికల నోడల్ అధికారిగా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.జిల్లా పోలీసు సంక్షేమ సంఘంలో మొత్తం 29 మంది సభ్యులను రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.ఇందులో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) పోలీసు విభాగం నుంచి 11 మంది, సివిల్ పోలీసు విభాగం నుంచి 18 మంది సభ్యులను ఎన్నుకోనున్నారు.డీఎస్పీలు,సీఐలు,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు.ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ,17వ తేదీన నామినేషన్ల పరిశీలన,18వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ,అనంతరం పోటీ అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిపారు.19 నుంచి 21వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహించి, వెంటనే ఫలితాలను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.ఎన్నికల్లో విజయం సాధించిన 29 మంది సభ్యులు ఈ నెల 22వ తేదీన 13 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీ (ప్యానెల్) ను ఎన్నుకుంటారని, అందులో జిల్లా కమిటీ అధ్యక్షుడు కూడా ఉంటారని ఎస్పీ వివరించారు.జిల్లాలో మొత్తం 1,067 మంది పోలీసు సిబ్బంది ఓటర్లుగా ఉన్నారని, రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అన్ని చర్యలు చేపట్టామని,ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**గరిడేపల్లి,ఆగస్టు 14 (ప్రజా జ్యోతి):**



విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన గరిడేపల్లి మండలం వెల్దండ గ్రామంలో చోటుచేసుకుంది.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దండ గ్రామానికి చెందిన గోదాటి సైదులు (42) శుక్రవారం చెరువు కాల్వలో చేపల బుట్ట వేసిన అనంతరం,కాల్వ సమీపంలోని వరి పొలంలో కొడవలితో గడ్డి కోస్తున్నాడు.ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై వివరాలు సేకరించారు.మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.మృతుడికి ముగ్గురు కుమార్తెలు కలరు.కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న సైదులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# శ్రీ వెన్నెల జ్యూయలరీ షాపును ప్రారంభించిన.. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి





**నల్గొండ టౌన్ ఆగస్టు 14,(ప్రజా జ్యోతి ):**

నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వెన్నెల జ్యూయలరీ అండ్ శారీస్ షాపును శుక్రవారం నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు జ్యూయలరీ వస్తువులతో పాటు పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్ ఒకే చోట ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.ఎలాంటి తరుగు, మేకింగ్ చార్జెస్ లేకుండా వెండి బంగారు ఆభరణాలు అమ్మకాలు జరుపుతున్నారని, ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విచ్చేసిన అతిథులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ, నల్లగొండ మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, ఏదుళ్ళ మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్లు రఫీ ఉద్దీన్ హాజీ,యమ కవిత దయాకర్, మాజీ కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్, ఫసాహత్ అలీ బాబా, వెన్నెల సారీస్ అధినేత చొక్కారపు వెంకన్న,మాధవి, సాయి నిఖిల్, వెన్నెల, మిర్యాల దేవేందర్, వినోద్,భజరంగ్, నిర్మల, ప్రీతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య దినోత్సవానికి కట్టుదిట్టమైన భద్రత

## - ఆర్టీసీ బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, లాడ్జీలు, హోటళ్లలో విస్తృత తనిఖీలు..

## - నాకాబందీ తనిఖీలను పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్గొండ ఆగస్టు 14,(ప్రజా జ్యోతి ):**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నల్గొండ జిల్లా పోలీస్ శాఖ పట్టణంలో విస్తృత నాకాబందీ, వాహన తనిఖీలు చేపట్టింది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్వయంగా ఆర్టీసీ బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లు తదితర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, తనిఖీలను పరిశీలించారు.పోలీసులు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచి, లాడ్జీలు, హోటళ్లలో బస చేస్తున్న వారి వివరాలను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తుండగా, అవసరమైన ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు.ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ విజ్ఞప్తి చేశారు.



